AKSHARA TODAY


అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

6-4-2026 (Monday) MAIN EDITION

## రన్‌వేపై ఆగిపోయిన విమానం..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** సాంకేతిక సమస్యతో ఓ విమానం రన్‌వేపై ఆగిపోయింది. దీంతో మిగతా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. శంషాబాద్ నుంచి రాయపూర్ వెళ్లాల్సిన విమానం ఒక్కసారిగా రన్‌వేపై ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఫ్లైట్ నిలిచిపోవడంతో విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సిన విమానాలు కొద్దిసేపు గాలిలో చక్కర్లు కొట్టాయి. అధికారులు అప్రమత్తమై దానిని పక్కకు తొలగించారు.

## నేటి నుంచి పెరగనున్న ఎండలు

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో మళ్లీ ఎండలు పెరగనున్నాయి. గత మూడు, నాలుగు రోజులుగా అకాల వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. పలుచోట్ల వడగళ్లు పడ్డాయి. అయితే సోమవారం నుంచి వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే 23 రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణ పరిధిలోనే ఉంటాయి. ఏప్రిల్ 10 తర్వాత, వడగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో ఉత్తర, తూర్పు తెలంగాణలో ఉష్ణోగ్రతలు 4143 డిగ్రీల వరకు, హైదరాబాద్ నగరంలో 3941 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉంది.

## పాకిస్థాన్ పాట పాడుతున్న కాంగ్రెస్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: కాంగ్రెస్ చర్యలు పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయని, జాతీయ భద్రతకు అది ప్రమాదమని ప్రధాని మోదీ అన్నారు. ఆ పార్టీ ఎల్లప్పుడూ పాక్ పల్లవినే అందుకుంటుందని.. దానిని మేం ఎప్పటికీ అనుమతించబోమని స్పష్టం చేశారు. చొరబాటుదారులను బాధితులుగా చూపాలని ఆ పార్టీ ప్రయత్నించిందని అసోంలోని బార్పేట సభలో ఫైరయ్యారు.

## ఇరాన్ ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి చెందారు. ఈమేరకు ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. సోమవారం ఉదయం జరిగిన వైమానిక దాడిలో ఖాదేమి మరణించినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.

## గ్రీన్‌ఛానెల్ ద్వారా ఊపిరితిత్తుల తరలింపు



అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ: ఓ వ్యక్తి ఆపరేషన్ కోసం ఊపిరితిత్తులను కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. దీని కోసం హైదరాబాద్ పోలీసులు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమానంలో ఊపిరితిత్తులను తరలించారు. మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించేందుకు వీలుగా పోలీసులు గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేశారు.

# బాసర ఆలయాభివృద్ధికి శ్రీకారం..



**దక్షిణ భారతంలోనే ప్రసిద్ధి చెందిన సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం బాసర. ఈ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వివిధ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.**

**- అక్షరటుడే, బాసర**

- **పుణ్యక్షేత్రం విస్తరణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ**
- **రూ. 225 కోట్లలో రీడెవలప్‌మెంట్**

నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం దర్శించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

### ఆలయ పునరాభివృద్ధి మాస్టర్‌ప్లాన్

బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయాన్ని పునరాభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. ఇందులో భాగంగా ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. ఇందులో భాగంగా ఆలయాన్ని విస్తరించనున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా శృంగేరి పీఠాధిపతుల సంప్రదింపులతో తుది ప్రణాళిక సిద్ధం చేశారు. గర్భాలయం, అర్ధ మండపం, గోపురాలు, మాడ వీధుల నిర్మాణానికి వారి అనుమతులు తీసుకున్నారు.

### చేపట్టనున్న పనులివే..

ప్రస్తుతం ఉన్న ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 60 వేల చదరపు అడుగులకు పెంచనున్నారు. నిర్మాణాలన్నీ శిలలతో చేపట్టనున్నారు. 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజనశాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం నిర్మించనున్నారు. ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయ పరిధిని 5 వేల చదరపు అడుగులకు విస్తరించనున్నారు. ఆలయానికి ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురాన్ని, మిగిలిన మూడు దిశల్లో 7 అంతస్తుల గోపురాల నిర్మాణం చేపట్టనున్నారు. 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాఢ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. అలాగే మరిన్ని అభివృద్ధి పనులు చేయనున్నారు. భూమిపూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్ రెడ్డి, బుజ్జి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్ట్ కీలక నేత లొంగుబాటు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్ట్‌ల లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. తాజాగా తెలంగాణ పోలీసుల ఎదుట 40 మంది నక్సల్స్ సరెండర్ అయినట్లు సమాచారం. ఇందులో పీఎల్‌జీఏ డిప్యూటీ కమాండర్ సోది కేశాలు అలియాస్ మల్లా సైతం ఉన్నారు. దీంతో రాష్ట్రంలో మావోయిస్టు కేడర్ బలం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. పీఎల్‌జీఏ కమాండర్ బర్స దేవా గతంలో లొంగిపోయిన విషయం తెలిసిందే. ఆయనకు కేశాలు రెండో కమాండర్‌గా పరిగణించబడ్డాడు. మార్చి 31లోపు దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్రం తెలిపిన విషయం తెలిసిందే.

## ‘రూ.3 వేల కోట్ల భూములపై సీఎం కన్ను’



**అక్షరటుడే, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కోహెడ ఫ్రూట్ మార్కెట్ భూములను అమ్మడానికి ప్రభుత్వం యత్నిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆయన సోమవారం పండ్ల మార్కెట్‌ను సందర్శించారు. రైతులకు ఉపయోగపడే 200 ఎకరాల కోహెడ మార్కెట్ భూమిపై రేవంత్ రెడ్డి కన్ను పడిందని హరీశ్‌రావు అన్నారు. రూ.3 వేల కోట్లు విలువ చేసే ఈ భూములను తన అనుయాయులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ నిర్మాణానికి స్థలంతో పాటు రూ. 350 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నా పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

## ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు..: మంత్రి రాజనర్సింహ





**అక్షరటుడే, హైదరాబాద్:** ఆహార పదార్థాలను కల్తీ చేసే వారికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వార్నింగ్ ఇచ్చారు. కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వాకథాన్ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. మంత్రి రాజనర్సింహ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జలవిహార్ నుంచి ఐమ్యాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వరకూ ఫుడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఫుడ్ సేఫ్టీ శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా నిరంతర తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రెండేళ్లలో 11,000కు పైగా తనిఖీలు నిర్వహించి, కల్తీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

## అత్యాధునిక క్షిపణిని తయారు చేస్తున్న ఉత్తర కొరియా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తర కొరియా అత్యాధునిక క్షిపణి అభివృద్ధి కోసం పరీక్షలు చేస్తోంది. ఇటీవల శక్తిమంతమైన ఘన ఇంధన క్షిపణి ఇంజిన్‌ను విజయవంతంగా పరీక్షించింది. పరిధిని పెంచడానికి, బరువైన, బహుశా బహుళ వార్‌హెడ్‌లను మోసుకెళ్లడానికి వీలుగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల కోసం ఉత్తర కొరియా ఈ ప్రయోగం చేసిందని దక్షిణ కొరియా చట్టసభ సభ్యులు సోమవారం తెలిపారు. ఉత్తర కొరియా మార్చిలో ఒక ఘనఇంధన రాకెట్ ఇంజిన్‌ను భూమిపై పరీక్షించింది. ఇది దాని తాజా ఐసీబీఎం కోసం అభివృద్ధి చేయబడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బ్లాక్ అవుట్ ఫిట్‌లో హీట్ పుట్టిస్తున్న దిశాపటాని..



**వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి సోషల్ మీడియాలో గ్లామర్ ఫొటోలను షేర్ చేస్తోంది ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ దిశాపటాని. తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులలో హీట్ పెంచే ప్రయత్నం చేసింది. అసలే సమ్మర్ పైగా బ్లాక్ డ్రెస్ ధరించి సెగలు పుట్టించేలా షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.**


**- అక్షరటుడే, సినిమాడెస్క్**

## కాల్పుల విరమణ దిశగా ప్రణాళిక..!




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఇరాన్, అమెరికా కాల్పుల విరమణ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో ఒక ప్రతిపాదనపై అమెరికా, ఇరాన్ సమీక్షిస్తున్నాయి. తాజా ప్రణాళిక ప్రకారం తక్షణ కాల్పుల విరమణ, ఆ తర్వాత విస్తృతమైన, సమగ్రమైన ఒప్పందంతో కూడిన రెండు దశల ప్రక్రియ ఉంటుంది. పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్టు దేశాలు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. ఇరాన్ ప్రస్తుతం హర్ముజ్ జలసంధిని మూసివేసింది. దీంతో అనేక నౌకలు నిలిచిపోయాయి. చమురు, గ్యాస్ సరఫరాలో అంతరాయం నెలకొంది. ఈ క్రమంలో హర్ముజ్ జలసంధిని తెరవాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. మంగళవారంలోపు దానిని ఓపెన్ చేయకపోతే దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే తాత్కాలిక కాల్పుల విరణమలో భాగంగా జలసంధిని తెరవడానికి ఇరాన్ అంగీకరించడం లేదని సమాచారం.

## ఢిల్లీ అసెంబ్లీ గేటును ఢీకొని లోనికి దూసుకెళ్లిన కారు



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ దగ్గర హైటెన్షన్ నెలకొంది. ఓ కారు గేటును ఢీకొట్టి అసెంబ్లీలోకి దూసుకొచ్చింది. దీంతో భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఢిల్లీ శాసనసభ ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం భద్రతా ఉల్లంఘన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఒకటి భద్రతా కంచెను ఢీకొట్టి అత్యంత కట్టుదిట్టమైన భద్రత గల ప్రాంగణంలోకి ప్రవేశించింది. ఉత్తర ప్రదేశ్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉన్న ఆ వాహనం గేట్ నెం. 2 ద్వారా లోపలికి ప్రవేశించింది. దీంతో భద్రతా సిబ్బందిలో భయాందోళనలు చెలరేగి, అధికారులు వెంటనే స్పందించారు. అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించే ముందు ఆ వాహనం కంచెను ఢీకొట్టింది. భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ ఆ వాహనం బారికేడ్‌ను ఛేదించుకుని నిషేధిత ప్రాంతంలోకి ఎలా ప్రవేశించగలిగిందనే దానిపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

## పెరిగిన పీఎన్‌జీ కనెక్షన్లు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో నెలన్నరగా జరుగుతున్న యుద్ధం కారణంగా వంటగ్యాస్ సరఫరాలో జాప్యం జరుగుతోంది. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. పశ్చిమాసియాలో యుద్ధం వంటగ్యాస్ ఎల్పీజీ సరఫరాలకు అంతరాయం కలిగిస్తుండడంతో ప్రభుత్వం పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ప్రధానంగా నగరాల్లోని గృహాలు, వ్యాపారాల కోసం పీఎన్‌జీని ప్రోత్సహిస్తోంది. రీఫిల్స్ బుక్ చేసుకునే శ్రమ లేకుండా గ్యాస్ పైప్‌లైన్ ద్వారా నేరుగా ఇంటికే సరఫరా అవుతుంది. దీంతో పీఎన్‌జీ కనెక్షన్‌లు పెరుగుతున్నాయి. గత నెలలో 3.1 లక్షలకు పైగా కనెక్షన్లకు గ్యాసిఫికేషన్ చేశారు. దీనికితోడు మరో 2.7 లక్షల కనెక్షన్లను జారీ చేశారు. మరోవైపు ఇదే సమయంలో 6 వేల మంది పీఎన్‌జీ వినియోగ దారులు ఎల్పీజీ కనెక్షన్లను వదులుకోవడం గమనార్హం.